క్లుప్తంగా

నేడు త్యాగరాజ ఆరాధనోత్సవం

చంద్రగిరి: స్థానిక పాతపేటలోని ధర్మరాజుల ఆలయ ఆవరణలో సోమవారం త్యాగరాజ ఆరాధనోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పండ్లూరు మునిరత్నం తెలిపారు. ప్రతి ఏటా ధర్మరాజుల ఆలయంలో ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సోమవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా నాదస్వర కచేరి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ నాదస్వర కళాకారులు హాజరుకానున్నారని తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి





ఎమ్మెల్యే వెంకటే గౌడ, ఎమ్మెల్సీ భరత్

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఎమ్మెల్యే వెంకటేగౌడ్, తెలంగాణ ఎమ్మెల్సీ సుంకరి రాజు, ఎమ్మెల్సీ భరత్, ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఏపీ ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు ప్రసాదాలతో సత్కరించారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా ప్రభాకర్‌రెడ్డి



రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డిని అభినందిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా టీటీడీ విశ్రాంత డెప్యూటీ ఈవో, గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. లక్ష్మీపురం సర్కిల్‌లోని ఒక ప్రైవేటు హోటల్లో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశం నిర్వహించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సుంకర రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డిని 302 జిల్లా వాకర్స్ ఇంటర్నేషనల్ నూతన గవర్నర్‌గా ప్రకటించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ నూతన కమిటీ రాయలసీమ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి వంటి ఐదు రాష్ట్రాల్లో అనేక నూతన వాకర్స్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు.

తిరుమలలో మహిళ ఆత్మహత్య

తిరుమల : తిరుమలలో ఆదివారం రాత్రి ఒక మహిళ శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన సుమతి(53) కొంత కాలంగా స్థానిక వరాహస్వామి అతిథి గృహానికి సమీపంలోని ఒక హోటల్‌లో పనిచేస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె జీవితంపై విరక్తి చెంది బాటగంగమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డులోని మరుగుదొడ్డిలో శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. లోపలి నుంచి పొగలు వస్తుండడంతో స్థానికంగా పనిచేసే సిబ్బంది అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. టీటీడీ వీజీవో బాలిరెడ్డి, ఏవీఎస్వో గిరిధర్, టూటౌన్ పీఎస్ ఎస్‌ఐ మంజుల అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి ఆచూకీని గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుషామృగ వాహనంపై కపిల విభుడు



పురుషా మృగ వాహనంపై కొలువైన కామాక్షి సమేత కపిలేశ్వరస్వామి

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన ఆదివారం ఉదయం కామాక్షి, కపిలేశ్వరస్వామి పురుషామృగ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భజన బృందాల భజనలు, కోలాటాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వాహన సేవ వేడుకగా సాగింది. తెల్లవారుజామున 12 నుంచి ఉదయం 4 గంటల వరకు లింగోద్భవకాల అభిషేకాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం సుప్రభాతం తర్వాత అభిషేకం చేశారు. 7 నుంచి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పురుషామృగ వాహన సేవ తర్వాత స్నపన తిరుమంజనం చేశారు. రాత్రి స్వామి వారి తిరుచ్చి ఉత్సవం అత్యంత వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ఆవరణలోని కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు శివపార్వతుల కల్యాణం శాస్త్రోక్తంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: మండలంలోని తొండవాడ స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన అగస్తీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆది దంపతుల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా నటరాజ మండపానికి చేరుకున్నారు. అక్కడ అర్చకులు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారికి కల్యాణం చేస్తున్న అర్చకులు



చంద్రగిరి: ఆది దంపతులకు కల్యాణం చేస్తున్న అర్చకులు

అదేవిధంగా స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులో వెలసిన శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో మహాశివరాత్రి, ఆలయ శతాబ్ది ఉత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున లింగోద్భవ అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. అర్చకుడు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో సాయంత్రం పార్వతి పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

రచయిత శైలకుమార్‌కు ఘన సన్మానం



శైలకుమార్ దంపతులను సన్మానిస్తున్న భూమన్, ఎమ్మెల్యే భూమన, భువన చంద్ర, లక్ష్మీపార్వతి

తిరుపతి కల్చరల్: ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ప్రముఖ రచయిత శైలకుమార్ స్నేహం బాపు రమణల స్నేహంలాంటిదని సినీ రచయిత భువనచంద్ర కొనియాడారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం డీబీఆర్ కల్యాణ మండపంలో రచయిత శైలకుమార్‌ను ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ భూమన్ మాట్లాడుతూ గతంలో తాము ఎమ్మెల్యే భూమన, శైలకుమార్‌తో కలిసి రాయలసీమ అభివృద్ధితోపాటు ప్రజాశ్రేయస్సు కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు సాగించామని తెలిపారు. తెలుగు అకాడమీ చైర్మన్ లక్ష్మీపార్వతి మాట్లాడుతూ సాహిత్యం చాలా గొప్పదని, అది మనిషిని పరిమళింపజేస్తుందన్నారు. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో కవులు, కళాకారులు ఎంతోమంది ఉన్నారని పేర్కొన్నారు. టీటీడీ చైర్మన్‌గా కరుణాకరరెడ్డి చేపట్టిన గొప్ప కార్యక్రమాల్లో శైలకుమార్ సహకారం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ 1970వ దశకంలో విద్యార్థి దశ నుంచి తమ అన్న భూమన్ ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలు చేశానని, తనతో పాటు శైలకుమార్, పలువురు ప్రముఖులు జైలులో గడిపామని పేర్కొన్నారు. శైలకుమార్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మన శైల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రచయితలు, కవులు, సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ రాజారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : దేశాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర కీలకమని ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డి తెలిపారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్‌ఎస్‌ఎం) తొలి రాష్ట్ర మహాసభలు ఆదివారం ఎస్వీయూ సెనేట్ హాలులో నిర్వహించారు. ఇందులో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మేధో సమాజ ఆవిర్భావంతోనే సుస్థిర దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఆ దిశగా అధ్యాపకులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకంతో ఎస్వీయూలో అమలుచేస్తున్నట్లు తెలిపారు. యూజీసీ సభ్యుడు శివరాజ్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధిని కల్పించాలన్న ఆశయంతోనే కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని వివరించారు. ఏబీఆర్‌ఎస్‌ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ విదేశీ ఆచారాలు, సంప్రదాయాలతో మన సంస్కృతి, సంప్రదాయాలకు భంగం కలిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏబీఆర్‌ఎస్‌ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ నారాయణ లాల్ గుప్తా మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో భారతదేశ కీర్తి ప్రతిష్టలు పెరగడంతోపాటు అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్లడంలో అవసరమైన నైపుణ్యం కలిగిన విద్యార్థులను తయారుచేయడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. మహాసభలో జీ–20 నాయకత్వం, అధ్యాపకుల విలువలు, ఉన్నత విద్యాసంస్థల్లో అధ్యాపకుల సమస్యలు–వాటి పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. మహాసభల కార్యనిర్వాహక కార్యదర్శి రాజశేఖర్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రచారక్ విజయాదిత్య, వైవి. రామిరెడ్డితో పాటు వివిధ వర్సిటీల నుంచి ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధపూజ మహోత్సవం



సిద్ధపూజ మహోత్సవం నిర్వహిస్తున్న పండితులు

ఎర్రావారిపాళెం: తలకోన సిద్దేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సిద్ధపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సంతానం లేక వరపడిన మహిళలకు సిద్ధులు సిద్ధాన్నం వితరణ చేశారు. దీంతో మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. శని, ఆదివారాల్లో మారు పొంగళ్లు నిర్వహించనున్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి దంపతులు పాల్గొని స్వామి, అమ్మవారికి పూజలు చేశారు.



సిద్దేశ్వరస్వామి సేవలో జిల్లా కలెక్టర్ దంపతులు

హమాలీలను ఉద్యోగులుగా గుర్తించాలి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ పరిధిలోని మండల స్థాయి పాయింట్‌లో లోడింగ్, అన్ లోడింగ్ పనులు చేస్తున్న హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని హమాలీల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య కోరారు. గంధమనేని శివయ్య భవన్‌లో ఆదివారం సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీమార్ట్, రిలయన్స్ మార్ట్ తదితర కార్పొరేట్ కంపెనీలకు గోడౌన్లను తక్కువ అద్దెకు ఇచ్చి ప్రయివేటుపరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సీడబ్ల్యూసీ గోడౌన్లు కూడా రిలయన్స్ వారికి అప్పగించారని పేర్కొన్నారు. తద్వారా కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందని ధ్వజమెత్తారు. దీనిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత హమాలీ కార్మికులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాధాక్రిష్ణ, హమాలీ యూనియన్ నాయకులు చెంచయ్య, శేషయ్య, సురేష్, పాండు, సుబ్రమణ్యం, మురళి, దస్తగిరి, భాషా, కార్తీక్, వెంకటేష్, గణపతి పాల్గొన్నారు.

శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు

భాకరాపేట: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం అన్ని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి. శివపార్వతులకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. శనివారం అర్ధరాత్రి పలు ఆలయాల్లో లింగోద్భవ దర్శనం కల్పించారు. మండలంలోని నెమిలిగుండ్ల, బండకొండ సిద్దేశ్వర స్వామి, భీమేశ్వరస్వామి, తొగటపల్లిలోని కాశీవిశ్వేశ్వరస్వామి, దేవరకొండ శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.





బండకొండ సిద్దేశ్వరస్వామి, మాణిక్యాంబదేవి

జాగారానికి పోటెత్తిన భక్తులు



లింగోద్భవ అభిషేకం చేస్తున్న అర్చకులు

తిరుపతి మంగళం: మహాశివరాత్రి జాగారం సందర్భంగా మంగళంలోని అన్నపూర్ణ సమేత ఈశానేశ్వర నవలింగ క్షేత్రంలో లింగోద్భవ దర్శనానికి భక్తులు పోటెత్తారు. అన్నాభిషేకంలో ప్రత్యేకంగా పసుపు, కుంకుమ, అన్నాభిషేకం, మామిడి పండ్ల, ద్రాక్ష, చెరుకు రసం, వేడినీరు తదితర పంచద్రవ్యాలతో అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాశీశానంద సరస్వతి, సుబ్బారావు స్వామి తదితరులు పాల్గొన్నారు.



జీవలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జీవకోనలోని జీవలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు. రాత్రి జాగరణ చేసిన భక్తులు ఆదివారం ఉదయం స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జీవలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త సురేంద్రకుమార్‌రెడ్డి అన్నదానం చేశారు.

● ఎన్నికల నియమావళి అమలు



తుడా సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగు



మున్సిపల్ సర్కిల్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి కప్పేసిన ముసుగు



లీలామహల్ కూడలి వద్ద గోడకు అంటించిన పోస్టర్లను తొలగిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు నియమావళిని పక్కాగా అమలుచేస్తున్నారు. తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న నేతల విగ్రహాలకు ముసుగు వేశారు. అలాగే లీలామహల్ కూడలితోపాటు పలుచోట్ల గోడలపై అంటించిన పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

25న మార్కెట్ వేలం పాటలు

పుత్తూరు రూరల్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 25న కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండ్, జంతు వధశాలకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి తెలిపారు. వేలం దక్కించుకున్న వారు మున్సిపాలిటీ నిబంధనలకు లోబడి రుసుములు వసూలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



ఆదాయం దిశగా ఆర్టీసీ అడుగులు

- దుకాణాలు, పార్కింగ్ సెంటర్ల భర్తీ
- ఖాళీ స్థలాల వినియోగానికి చర్యలు
- కార్గో బలోపేతానికి కృషి

తిరుపతి అర్బన్: అత్యధికంగా ఆదాయాన్ని ఆర్జించి రాష్ట్రంలోనే తిరుపతి జిల్లాను మొదటి స్థానంలో నిలిపేలా ఆర్టీసీ అధికారులు అడుగులు వేస్తున్నారు. 2020–21లో కోవిడ్ సమయంలో ఆర్టీసీకి పెద్ద ఎత్తున నష్టం వచ్చింది. 2022 నుంచి కొంతమేర ఆదాయం పెరిగింది. నెలకు సరాసరి రూ.40 కోట్ల వరకు చేరింది. దుకాణాల అద్దె, కార్గో, ఖాళీ స్థలాల వినియోగానికి అధికారులు తీసుకున్న చర్యలతో ఆదాయం రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రోజు వారి ఆదాయం సరాసరి రూ.1.50 కోట్లకు చేరింది. దీన్ని మరింత పెంచడంతోపాటు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఖాళీగా ఉన్న దుకాణాలను భర్తీ చేస్తున్నారు. అలాగే ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అలాగే కార్గోను బలోపేతం చేసి వస్తువులను పెద్ద ఎత్తున రవాణా చేసి ఆదాయ ఆర్జనకు చర్యలు చేపట్టారు. ఆర్టీసీ నేతృత్వంలో పెట్రోల్ బంకులు, విద్యుత్ చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. తద్వారా ఏడాదికి రూ.500 కోట్ల మేర ఆదాయం ఆర్జించి సంస్థను నష్టాల ఊబి నుంచి గట్టెక్కించేందుకు ప్రయత్నాలు తీవ్రం చేశారు. తిరుపతి జిల్లా ఆర్టీసీ గత ఏడాది ఆదాయంలో మొదటి స్థానంలో నిలిచింది.



తిరుపతి ఆర్టీసీ బస్టాండ్

నెల వారీగా ఆర్టీసీ ఆదాయం

2023	జనవరిలో	రూ.49.36 కోట్లు
2022	డిసెంబర్‌లో	రూ.47.88 కోట్లు
2022	నవంబర్‌లో	రూ.43.97 కోట్లు
2022	అక్టోబర్‌లో	రూ.52.15 కోట్లు
2022	సెప్టెంబర్‌లో	రూ.44.91 కోట్లు
2022	ఆగస్టులో	రూ.49.57 కోట్లు
2022	జూలైలో	రూ.50.35 కోట్లు
2022	జూన్‌లో	రూ.48.44కోట్లు
2022	మేలో	రూ.47.69 కోట్లు
2022	ఏప్రిల్‌లో	రూ.41.79 కోట్లు

వనరుల వినియోగంతో ఆదాయం పెంపు

కోవిడ్ సమయంలో ఆర్టీసీకి పెద్ద దెబ్బ తగిలింది. అయినప్పటికీ ఉద్యోగులకు జీతాలు ఆపలేదు. నష్టాన్ని పూడ్చుకునేందుకు ఆదాయం పెంపునకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం రోజు వారి ఆదాయం రూ.1.50 కోట్లకు పైగా వస్తోంది. దీన్ని మరింత పెంచడానికి వనరులను వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అవసరమైన వారికి బస్సులను అద్దెకు ఇస్తున్నాం. కళాశాలలు, ఆస్పత్రులు, కర్మాగారాలు ఉన్న ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు వేస్తున్నాం. పండుగ వేళల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. కార్గో ద్వారా ఆదాయాన్ని సమకూర్చుతున్నాం. – తిమ్మాడి చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి

